# తథాగతుని మహాపరినిర్వాణం... త్యాగానికి చిరస్మరణీయం

**కుశీనగరంలో దుఃఖ నివారణ పూజలు**

**అగ్నిధార న్యూస్, (కుశీనగరం):**

లోక కల్యాణం కోసం తన ప్రాణాలనే పణంగా పెట్టిన గౌతమ బుద్ధుని మహాపరినిర్వాణ ఘట్టం మానవ చరిత్రలో అపూర్వమైనదిగా నిలిచిందని బౌద్ధ వర్గాలు పేర్కొంటున్నాయి. శాంతి, అహింస మార్గాలను ప్రపంచానికి చూపిన తథాగతుని త్యాగనిరతి కుశీనగరంలో మరల స్మరించుకున్నారు.చరిత్ర ప్రకారం, బుద్ధుడు తన 80వ ఏట బెలువ గ్రామంలో ధర్మబోధనలు నిర్వహించారు. ఆ సమయంలో చుందుడనే భక్తుడు సమర్పించిన ఆహారంలో లోపం ఉన్నట్లు గ్రహించిన ఆయన, శిష్యుల ప్రాణాలను కాపాడేందుకు స్వయంగా ఆ ఆహారాన్ని మాత్రమే స్వీకరించినట్లు బౌద్ధ గ్రంథాలు సూచిస్తున్నాయి.అనంతరం ఆయన ఆరోగ్యం క్షీణించినప్పటికీ, శిష్యుల మనోధైర్యం దెబ్బతినకుండా తన బాధను సహించినట్లు పేర్కొంటారు.తీవ్ర అనారోగ్యంతోనూ బుద్ధుడు ధ్యానంలో నిలిచి తన ధర్మబోధను కొనసాగించారు. అనంతరం కుశీనగరానికి చేరుకుని భిక్షువులకు చివరి సందేశాన్ని అందించారు.ధర్మంపై సందేహాలు ఉంటే అడగాలని పిలుపునిచ్చినా ఎవరూ స్పందించకపోవడంతో, విపశ్యన ధ్యానంలో లీనమై మహాపరినిర్వాణం పొందినట్లు పేర్కొంటారు."తమకు తామే వెలుగుగా మారాలి" అనే ఆయన సందేశం నేటికీ మార్గదర్శకంగా నిలుస్తోంది.ఈ సందర్భంగా కుశీనగరంలో బౌద్ధ సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బౌద్ధ భిక్షువు బంతే సత్యబోధి ఆధ్వర్యంలో 'దుఃఖ నివారణ పూజ' నిర్వహించగా, శాంతి, సౌహార్ద్రం నెలకొనాలని ప్రార్థించారు.బుద్ధుని మహాపరినిర్వాణం కేవలం చారిత్రక సంఘటన మాత్రమే కాకుండా, త్యాగం, కరుణ, ధర్మబోధలకు ప్రతీకగా నిలిచిందని బౌద్ధ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## రామగుండంలో నూతన తహాశీల్దార్ నియామకానికి అభినందనలు

**మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన మద్దెల దినేష్**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

రామగుండం మండలానికి నూతన తహాశీల్దార్‌ను నియమించిన రాష్ట్ర ప్రభుత్వం మరియు జిల్లా కలెక్టర్‌కు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ అభినందనలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహాశీల్దార్ రవిందర్‌ను శుక్రవారం తహాశీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామగుండం మండలంలో గత పదిహేను రోజులుగా తహాశీల్దార్ లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. స్థానిక పరిస్థితుల నేపథ్యంలో కార్యాలయ సిబ్బంది విధులు బహిష్కరించడం వల్ల ప్రజలకు సర్టిఫికేట్లు, ఇతర సేవలు పొందడంలో ఇబ్బందులు తలెత్తినట్లు పేర్కొన్నారు. ఈ సమస్యపై ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ తరఫున జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి నూతన తహాశీల్దార్‌ను నియమించడం ఆనందదాయకమని అన్నారు.మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా అర్హులైన వారికి సర్టిఫికేట్లు, రేషన్ కార్డులు, భూ సమస్యల పరిష్కారం వంటి సేవలను పారదర్శకంగా అందించాలని తహాశీల్దార్ రవిందర్‌ను కోరారు.

## గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం 31వ నెలగా కొనసాగుతున్న సేవ



**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

వేరుకొండ బిక్షపతి గౌడ్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుమారు 200 మంది రోగులకు భోజనం పంపిణీ చేశారు.ప్రతి నెల అమావాస్య సందర్భంగా తల్లిదండ్రులను స్మరించుకుంటూ ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇదే కార్యక్రమం 31వ నెలగా కొనసాగుతుండటం విశేషం.ఈ కార్యక్రమానికి మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు బెందె నాగభూషణ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, ఇలాంటి సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు.సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు మరింతగా చేపట్టాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో వేరుకొండ బిక్షపతి గౌడ్, బెందె నాగభూషణ్ గౌడ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణపై బీజేపీ వ్యాఖ్యలు అభ్యంతరకరం

**: డా. బి. జనక్ ప్రసాద్**

**అగ్నిధార న్యూస్ ,(హైదరాబాద్):**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియపై భారతీయ జనతా పార్టీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు తీవ్రంగా అభ్యంతరకరమని కనీస వేతన సలహా మండలి చైర్మన్ డా. బి. జనక్ ప్రసాద్ విమర్శించారు. తెలంగాణ ప్రజల దీర్ఘకాల పోరాట ఫలితంగా ఏర్పడిన రాష్ట్రాన్ని అవమానించేలా మాట్లాడడం తగదని అన్నారు.తెలంగాణ రాష్ట్రం ప్రాణత్యాగాలు, ఆత్మబలిదానాలు, ఎన్నో ఉద్యమాల ఫలితంగా ఏర్పడిందని గుర్తు చేశారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్ర విభజన జరిగిందని, ఆ ప్రక్రియను అవమానించడం అంటే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహేబ్ అంబేద్కర్‌ను అవమానించినట్లేనని పేర్కొన్నారు.తెలంగాణ ఏర్పాటుకు మద్దతుగా నిలిచిన మాజీ కేంద్ర మంత్రి సుష్మ స్వరాజ్ పాత్రను గుర్తుచేసుకుంటూ, ఆ ప్రక్రియను అవహేళన చేయడం ఆమెను కూడా అవమానించినట్లేనని అన్నారు. తెలంగాణ ప్రజలు ఆమెను ప్రేమగా 'చిన్నమ్మ'గా సంబోధించేవారని తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు బీజేపీ నాయకులు గతంలో తెలంగాణ విభజనపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, అవి రాష్ట్ర ప్రజల భావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని విమర్శించారు. అలాగే కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.ఇటీవల పార్లమెంట్‌లో తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకపోవడం తెలంగాణ బీజేపీ నాయకుల వైఖరిని స్పష్టంగా చూపుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంపై ఎలాంటి అవమానకర వ్యాఖ్యలు చేసినా ప్రజలు సహించరని హెచ్చరించారు.

## ప్రశాంత్ కు ఆధ్యాత్మిక సేవకు పురస్కారం.



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని/8ఇంక్లైన్ కాలనీ ఏప్రిల్ :17**

కొమురవెల్లి మల్లన్న ఉపాసకులుగా భక్తులకు విశిష్టమైన ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్న పొలవేన ప్రశాంత్ కు ఆధ్యాత్మిక సేవ పురస్కారం దక్కింది. గురువారం రాత్రి హైదరాబాదులోని రవీంద్ర భారతి వేదికగా తెలంగాణ సాంస్కృతిక శాఖ సారథ్యంలో రోజా క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన చార్లీ చాప్లిన్ 137వ జయంతోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి చేతుల మీదుగా ఆధ్యాత్మిక పురస్కారాన్ని అందజేశారు. భక్తులకు మరింత ఆధ్యాత్మికంగా సేవలు అందించాలని మరెన్నో పురస్కారాలు అందుకోవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## టాస్క్ సెంటర్ ద్వారా ఉద్యోగాలు



**జిల్లా ఉపాధి అధికారి తిరుపతి రావు.**

**టాస్క్ సెంటర్‌లో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతం.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, ఏప్రిల్ 17:**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని టాస్క్ సెంటర్‌లో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతంగా పూర్తయిందని జిల్లా ఉపాధి అధికారి తిరుపతి రావు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఉపాధి అధికారి మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 380 మంది అభ్యర్థులు హాజరయ్యారని, అందులో 62 మంది ఎంపిక కాగా, మరో 9 మంది షార్ట్‌లిస్ట్ అయినట్లు పేర్కొన్నారు.జాబ్ మేళాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తున్నాయని, ఇలాంటి కార్యక్రమాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో టాస్క్ మేనేజర్ గంగా ప్రసాద్, సెంటర్ ఇంచార్జి కౌసల్య, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్స్, ఇతర కళాశాల ప్రతినిధుల, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి :** ఈనెల 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిగడ్డ కాళేశ్వరం, అనంతరం కాటారం మండలం నస్తురుపల్లిలో రైతు భరోసా రెండో విడత నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

## ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి



**గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రుల పనితీరును మరింత మెరుగుపర్చాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం రామగుండంలోని గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు.ఆసుపత్రిలోని మెడికల్ ఓపీ విభాగం, న్యూ బ్లాక్, ఐసీయూ బ్లాక్, అత్యవసర విభాగం, డ్యూటీ వైద్యుల గదులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రి ప్రాంగణంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. పరిశుభ్రత, శానిటేషన్ పనితీరును మెరుగుపర్చాలని సంబంధిత సంస్థకు స్పష్టమైన సూచనలు చేశారు. అవసరమైతే తక్షణమే తనను కలవాలని ఆదేశించారు.రోగుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని పడకల సంఖ్యను పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని, మెడిసిన్ విభాగానికి అదనంగా ఓపీ బ్లాక్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ల్యాబ్ పరికరాలు, ఏసీ వంటి సదుపాయాల్లో లోపాలు తలెత్తిన వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలో డాక్టర్లు కృపాబాయి, రాజు, సంబంధిత అధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## నిరాధార వృద్ధురాలికి అండగా రాజేశ్వరి

**అగ్ని ధార న్యూస్, (శ్రీరాంపూర్):**



కుటుంబంలో వరుస విషాదాలతో ఒంటరిగా మిగిలిన ఓ వృద్ధురాలికి సామాజిక సేవకురాలు అండగా నిలిచిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. శ్రీరాంపురానికి చెందిన జాడి మల్లమ్మ వృద్ధాప్యంతో తీవ్ర అనారోగ్యానికి గురై, తన పనులు తాను చేసుకోలేని పరిస్థితిలో ఉన్నారు.మల్లమ్మ జీవితంలో వరుస దుర్ఘటనలు చోటుచేసుకున్నాయి. భర్త సింగరేణిలో పనిచేస్తూ మృతి చెందగా, ఏకైక కుమారుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం కోడలు కూడా మరణించడంతో ఆమె పూర్తిగా నిరాధారంగా మారింది. ప్రస్తుతం చూసుకునే వారే లేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది.ఈ విషయాన్ని తెలుసుకున్న సామాజిక సేవకురాలు ఆకుదారి రాజేశ్వరి మానవతా దృక్పథంతో స్పందించారు. శుక్రవారం మల్లమ్మ నివాసానికి చేరుకుని ఆమెకు క్షవరం చేయించి, స్నానం చేయించి, కొత్త బట్టలు అందజేశారు.అనంతరం భోజనం ఏర్పాటు చేసి ఆమెకు తగిన సంరక్షణ కల్పించారు.స్థానికులు రాజేశ్వరి సేవలను అభినందిస్తూ, ఇలాంటి సందర్భాల్లో సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. వృద్ధులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కాలనీవాసుల వినతి

**మంద కొమురమ్మ కాలనీ దీక్షలు ఏడో రోజుకు**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ మంద కొమురమ్మ కాలనీవాసులు చేపట్టిన దీక్షలు శుక్రవారం ఏడో రోజుకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా కాలనీవాసులు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్దకు చేరుకుని మేయర్ మహంకాళి స్వామికి వినతిపత్రం అందజేశారు.కాలనీవాసులు తమ సమస్యలను వివరిస్తూ, "కిరాయి ఇళ్లలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చిన్న గదుల్లో పెద్ద కుటుంబాలతో జీవనం సాగించడం కష్టంగా మారింది. 'కాళ్లు చాపితే బోళ్లు తాకే' పరిస్థితుల్లో ఉన్నాం. నెలనెలా కిరాయి చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం" అని విన్నవించారు.వినతిపత్రం స్వీకరించిన మేయర్ మహంకాళి స్వామి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి కాలనీవాసులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంద రవికుమార్, కర్నూరి ధర్మేందర్, పల్లె బాపు మాదిగ, రాసపల్లి రవికుమార్, కొండ్రా అరుణ, అంబాలా అర్చన, మచ్చ సుజాత, రొంటాల రాధా, కాజీపేట రాజయ్య, కాజీపేట సదానందం, మైస రవీందర్, ఆవునూరి గౌరి, మడిపల్లి దశరథం, కాంపెల్లి శ్రీనివాస్, మాతంగి కుమార్, రాచర్ల రాజేశం, పుల్లూరి కొమురయ్య, ఈర్ల రవి, రామంచ సరోజన, ములుగురు పోచమ్మ, సాతురి కృష్ణ, కనకం సుగుణ, శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.



